# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-03-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **భూమిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 55 వేల ఫామ్ పాండ్ల నిర్మాణాన్ని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ఈరోజు ప్రారంభించారు.**

**3.** **విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుల్లో భాగంగా తాజాగా 600 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.**

**4.** **నెల్లూరు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తాగునీటి పథకం పనులను త్వరలోనే పూర్తి చేస్తామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ తెలిపారు.**

**5.** **రెవెన్యూ, జలవనరుల శాఖ సమన్వయంతో వారాబందీ పగడ్బందీగా నిర్వహించాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు.**

==========================

భూమిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దానిని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ చేయగలిగినంత సాయం చేయాలని ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈరోజు ఎర్త్ అవర్ సందర్భంగా రాత్రి 8 30 నిమిషాల నుంచి 9 గంటల 30 నిమిషాల వరకూ స్వచ్ఛందంగా విద్యుత్ వాడకం ఆపేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇళ్లు, కార్యాలయాలు, వ్యాపార సంస్థలు సహా తదితర చోట్ల లైట్లు, విద్యుత్ ఉపకరణాలు నిలిపి వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎర్త్ అవర్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లమంది ప్రజలను ఏకం చేస్తోందని, అందరూ కలిసి ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

--------------------------

రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 55 వేల ఫామ్ పాండ్ల నిర్మాణాన్ని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ఈరోజు కర్నూలు జిల్లా, ఓర్వకల్లు మండలం, పూడిచెర్ల గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన రోడ్లలో 98 శాతం పూర్తి చేశామన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో పంచాయతీ రాజ్ వ్యవస్థను పటిష్టం చేశామని, పల్లె పండుగ విజయవంతం అయ్యిందంటే దార్శనికత కలిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వల్లేనని చెబుతూ...

వాయిస్ 24 సెకన్లు

---

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుల్లో భాగంగా తాజాగా 600 కోట్లు రూపాయలు విడుదల చేసినట్లు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. త్వరలో మరో 400 కోట్లు విడుదల చేస్తామని ఈరోజు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, బకాయిలు చెల్లించడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటికి విద్యాశాఖలో 4 వేల 2 వందల 71 కోట్లు రూపాయలు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, ఈ మొత్తాన్ని విడతల వారీ చెల్లిస్తామని హామీ ఇచ్చామని, ఇప్పటికే 788 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు మంత్రి నారా లోకేష్ తెలిపారు.

---

నెల్లూరు నగరంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ హడ్కో నిధులతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తాగునీటి పథకం పనులను త్వరలోనే పూర్తి చేస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలోని వివిధ అభివృద్ధి పనులను ఆయన అధికారులతో కలిసి ఈరోజు పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... ఈ పథకాలకు హడ్కో సంస్థ 11 వందల కోట్ల రూపాయలను మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం 90 శాతం పనులు పూర్తయ్యాయని, మరో 10 శాతం పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. అభివృద్ధి పనుల విషయంలో అలసత్వం వహిస్తే సహించబోనని ఆయన హెచ్చరించారు. కొత్త పార్కుల నిర్మాణంతోపాటు పాత పార్కులను ఆధునికీకరిస్తున్నామన్నారు.

---

రెవెన్యూ, జలవనరుల శాఖ సమన్వయంతో వారాబందీ పగడ్బందీగా నిర్వహించాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. వివిధ జిల్లాల అధికారులతో నిన్న దృశ్యమాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రబీ పంటకు ఆఖరి ఎకరం వరకూ నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. కేసీ కాలువ ఆయుకట్టు, నాగార్జున సాగర్ కుడి, ఎడమ కాలువల ఆయుకట్టు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల ఆయుకట్టు పంటలకు పూర్తిస్థాయిలో నీరు అందించాలని సూచించారు.

---

'ఎర్త్ అవర్'లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు రాత్రి 8 గంటల 30 నిమిషాల నుంచి 9 గంటల 30 నిమిషాల వరకూ ప్రజలందరూ ఇళ్లలో లైట్లను ఆపేసి 'ఎర్త్ అవర్' ను పాటించాలని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపు నిచ్చారు. వాతావరణ పరిరక్షణ ఉద్యమంలో భాగస్వాములై భవిష్యత్ తరాలకు మెరుగైన ప్రపంచాన్ని అందించడంలో సహాయపడదామని గవర్నర్ పేర్కొన్నారు.

---

దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలను ప్రభుత్వం అందిస్తోందని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు జిల్లాలోని నూజివీడులో 83మంది లబ్ధిదారులకు 48 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... నిరుపేదల అభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

విజయవాడ ఆటోనగర్‌లో రోడ్లను పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్, శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, సిఆర్డిఏ కమిషనర్ కన్నబాబుతో కలిసి ఈరోజు పరిశీలించారు. మెట్రో, ఏలూరు రోడ్డు పై ఓవర్ పనుల వల్ల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఏర్పాటు చేయనున్నారు. ఆటోనగర్‌కు లారీల రాకపోకలకు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ మార్గాల కోసం సమీక్షించారు. మహానాడు రోడ్డు నుంచి నిడమానూరు వరకు ఫ్లైఓవర్, గన్నవరం నుంచి వచ్చే మెట్రో పనులు పూర్తయితే విజయవాడకు ట్రాఫిక్ సమస్య ఉండదని కేశినేని శివనాథ్ తెలిపారు. అప్పటి వరకూ ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలు సిద్ధం చేసి తాత్కాలిక శాశ్వత రహదారులు ఏర్పాటు చేస్తామని శివనాథ్ ఈ సందర్భంగా వెల్లడించారు.

..వాయిస్.. 25 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ  కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్....37 సెకన్లు....

---------------------------

క్రికెట్ క్రీడాభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఐపిఎల్ క్రికెట్ పోటీలు ఈ రోజు నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి పోటీ కోల్ కతా నైట్ రైడర్స్,  రాయల్ ఛాలంజెర్స్ బెంగళూరు జట్ల మధ్య కోల్ కతా ఈడెన్ గార్డెన్స్ మైదానంలో ఈరోజు రాత్రి 7 గంటల 30 నిముషాలకు ప్రారంభం కానుంది.

---------------------------

ఈ రోజు ప్రపంచ జల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. మానవ మనుగడకు నీటి ఆవశ్యకతను తెలియజెప్పి, పరిమిత వనరుగా ఉన్న నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలనే అవగాహన ప్రజల్లో కల్పించే లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి 1993 నుంచి ప్రతీ ఏటా మార్చి 22వ తేదీన ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. “హిమానీ నదుల సంరక్షణ” ఇతివృత్తంతో ఈ సంవత్సరం జల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. భావితరాలు నీటి కొరతను ఎదుర్కోకుండా నదులను సంరక్షించాలని ఈ సందర్భంగా అవగాహన కల్పిస్తూ పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

---------------------------

తీర ప్రాంత రక్షణపై ప్రజల్లో అవగాన కల్పించే లక్ష్యంతో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) చేపట్టిన సైక్లోథాన్ ఈరోజు ప్రకాశం జిల్లా ఒంగోలు చేరింది. జిల్లా పోలీసు కార్యాలయం వద్ద సైక్లోథాన్‌కు జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సైక్లోథాన్ కు కమాండెండ్ సంజీత్ మాట్లాడుతూ... తీర ప్రాంత ప్రజల్లో మత్తు పదార్థాలు, అక్రమ ఆయుధాల చొరబాటు వంటి వాటిపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ నెల 7వ తేదీన పశ్చిమ బెంగాల్‌లో ఈ సైక్లోథాన్ ప్రారంభమైందన్నారు. మొత్తం 60 మంది సభ్యులు ఉన్న ఈ బృందంలో మహిళలు కూడా ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా మహిళా సాధికారతపై కూడా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

=====================